సాక్షి తూర్పుగోదావరి

గురువారం 3 అక్టోబర్ 2024



దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు


దసరా సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు హైదరాబాద్ నుంచి తరలివచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను సిద్ధం చేశారు. -8లో



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కందరాజు షాన్విక్ శివ వర్మ (పాలకోడేరుకు) రూ.లక్ష విరాళం అందించారు.

3.08 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 3,08,168 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 12,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

మహిళా రక్షక్ ప్రారంభం

- జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ ప్రశాంతి
- అందుబాటులో ప్రత్యేక వాట్సాప్ నంబర్ 94932 06006



మహిళా రక్షక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి. చిత్రంలో ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు రాజమహేంద్రవరం: మహిళలు, బాలికలకు భద్రత కల్పించే దిశగా ఏర్పాటు చేసిన మహిళా రక్షక్‌ను రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్ వద్ద బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆధ్వర్యంలో ఆమె మహిళా రక్షక్ లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమారు 1,000 మందితో మహిళా మానవ హారం నిర్వహించారు. మహిళల రక్షణకు ప్రత్యేక వాట్సాప్ నంబర్ 9493206006 ను కేటాయించారు. దీంతోపాటు డయల్ 112 సేవలను నిరంతరం అందించే ఏర్పాట్లు చేశారు. ఒక మహిళా రక్షక్ వాహనంలో ఇన్‌చార్జి, నలుగురు మహిళా కానిస్టేబుల్స్, ఒక కానిస్టేబుల్ ఉంటారు. మహిళా రక్షక్‌కు వచ్చే ఫిర్యాదుల ఆధారంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టేందుకు అవసరమైతే డెకాయ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తారు. కొన్ని ముఖ్యమైన ప్రాంతాలు, విద్యాసంస్థల వద్ద మహిళా రక్షక్ బుక్స్‌ను ఉంచుతారు. మహిళా రక్షక్ ఆ ప్రాంతాలను సందర్శించినప్పుడు ఆ బుక్‌లో వచ్చే ఫిర్యాదులను చూస్తారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ మహిళా రక్షక్ కార్యక్రమాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. ఎస్పీ డి.నరసింహకిషోర్ మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా స్త్రీ శిశు,సంక్షేమ అధికారి కె.విజయకుమారి, అడిషనల్ ఎస్పీ ఏవీ.సుబ్బరాజు, డీఎస్పీలు ఎస్.భవ్యకిషోర్, కె.రమేష్ బాబు, ఎస్‌జీపీవో జి.దేవకుమార్, ఎస్‌బీ సీఐ అనుసూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అభివృద్ధికి కార్యాచరణ

రాజానగరం: రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని, వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేసే విధంగా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. స్థానిక జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రిలోని 5వ ఫ్లోర్‌లో నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్, జనరల్ వార్డులను ఎంపీ పురందేశ్వరి, డిజిటల్ లేప్రోస్కోపిక్ సర్జికల్ యూనిట్‌ను మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం శుశ్రుత ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దగ్గుబాటి దంపతులతోపాటు ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్యచౌదరిలను సన్మానించారు. టీడీపీ నాయకులు గన్ని కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఈఓ కె. వాసుదేవరావు తెలిపారు. స్థానిక లూథర్‌గిరిలో గల రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల ఇయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. టెట్ రాష్ట్రవ్యాప్తం ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు సెషన్ -1 ఉదయం 9.30 నుంచి 12.00 వరకు, సెషన్ -2 మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 4 నుంచి ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులకు సందేహాలు ఉంటే సహాయ కేంద్రంలోని సూర్యనారాయణ 9949602721, శ్రీనివాస్ ప్రసాద్‌ను 8985943354 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అమ్మ అవతారాలకు వేళాయె..

- శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధం
- జిల్లాలో ప్రముఖ అమ్మవారి ఆలయాల్లో భారీ ఏర్పాట్లు
- రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో ప్రారంభమైన శ్రీబాలాత్రిపుర సుందరిదేవీ ఉత్సవాలు
- దేవాలయాల్లో నేటి నుంచి పూజలు





రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో బుధవారం రాత్రి 9.09 గంటలకు ప్రతిష్ఠితమైన బాలాత్రిపురసుందరిదేవి, దర్శనానికి పోటెత్తిన భక్తజన సందోహం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో శరన్నవరాత్రుల ఉత్సవాలకు సర్వం సిద్ధం అయ్యింది. తొమ్మిది రోజుల పాటు వైభవంగా అమ్మవారిని వివిధ అవతారాలలో దర్శించుకోవడానికి దేవాలయాలు, మంటపాల కమిటీలు అన్ని ఏర్పాట్లూ చేశాయి. నిడదవోలు కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం, చాగల్లు మెయిన్‌రోడ్డులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం, అనపర్తిలో దేవీచౌక్ సెంటర్, రాజమహేంద్రవరంలో దేవీచౌక్ సెంటర్‌లో దేవీనవరాత్రులను ఘనంగా నిర్వహిస్తారు. చిన్న పిల్లలకు, పెద్దవాళ్లకు చాలా ఇష్టమైన పండగ దసరా.. దసరా సందడి చూడాలంటే రాష్ట్రవ్యాప్తంగా పేరెన్నికగన్న రాజమహేంద్రవరం దేవీచౌక్ గుర్తుకువస్తుంది. అక్కడ శ్రీబాలాత్రిపుర సుందరి దేవి శరన్నవరాత్ర ఉత్సవాలు బుధవారం రాత్రి 9.09 గంటలకు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు వైభవంగా అమ్మవారికి విశేష అలంకరణలే కాకుండా రోజూ జానపద, పౌరాణిక నాటకాలు ప్రదర్శితమవుతాయి.

ఇదీ దేవీచౌక్ చరిత్ర

బత్తుల కామరాజు, బత్తుల మునియ్య రాజమహేంద్రవరం నగరం నుంచి కోల్‌కతాకి చింతపండు వ్యాపారం కోసం తరచు వెళ్లి వస్తుండేవారు. దసరా సమయంలో కోల్‌కతాలో దేవీ నవరాత్రులను చూసి ఆశ్చర్యపోయారు. ఇంత దేదీప్యమానంగా అమ్మవారి ఉత్సవాలను మన నగరంలోనూ చేయాలని వారు నిశ్చయించుకున్నారు. అలా 1934వ సంవత్సరంలో రాజమహేంద్రవరం నగరంలోని మూడు లాంతర్ల సెంటర్‌లో అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించారు. 1960లో అమ్మవారి పాలరాతి విగ్రహాన్ని అప్పటి మున్సిపల్ చైర్మన్ నిడమర్తి వెంకట నరసింహారావు ఆధ్వర్యంలో మూడు లాంతర్ల సెంటర్‌లో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆ సెంటర్ దేవీచౌక్ సెంటర్‌గా ప్రసిద్ధికెక్కింది.

నాటకాలకు విశేష స్పందన

రాజమహేంద్రవరం దేవీచౌక్ సెంటర్‌లో దసరా ఉత్సవాలలో ప్రదర్శించే నాటకాలకు విశేష స్పందన ఉండేది. దేవి నవరాత్రుల సందర్భంగా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన నాటకాలను చూడడానికి జనం తండోపతండాలుగా వచ్చేవారు. రాత్రి ప్రదర్శించే నాటకాన్ని తిలకించడానికి జనంతో పాటు సినీ తారలు కూడా ఇక్కడికి వచ్చేవారు. వారు సామాన్య జనాలు లాగా పద్యాలకు చప్పట్లు కొట్టి కళాకారులను ప్రోత్సహించేవారు. అంతే కాకుండా ఇక్కడి లైటింగ్ సెట్లు, డెకరేషన్ చూడడానికి రెండు కళ్లూ సరిపోవంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ నాలుగు కూడళ్లలో ఎటూ చూసినా కోలాహలంగా, సందడిగా ఉండేది. భారీ సెట్టింగ్‌లు, లైటింగ్ ఎఫెక్ట్స్ ఏర్పాటు చేశారు. సుదీర్ఘంగా 91 సంవత్సరాల నుంచి ఇక్కడ శ్రీబాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారి శరన్నవరాత్ర ఉత్సవాలను కమిటీ క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ఇక్కడ ప్రదర్శించే నాటకాలకు రాష్ట్ర వ్యాప్తంగా పేరు రావడంతో ఒక్కసారైనా ఇక్కడ నాటకాలలో నటించాలని కళాకారులు ఉవ్విళ్లూరేవారు. శ్రీరామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణతులాభారం, చింతామణి, బొబ్బిలి యుద్ధం, మహాకవి కాళిదాసు, సత్యహరిశ్చంద్ర, గయోపాఖ్యానం, బాలనాగమ్మ, శ్రీరామాంజనేయ యుద్ధం, కురుక్షేత్రం వంటి నాటకాలలో ప్రసిద్ధ రంగస్థల నటులు నటించారు. సురభి వారు ప్రదర్శించే నాటకాలలో ఫైర్‌సెట్టింగ్ కూ పెద్ద పేరు ఉండేది. వారి నాటకాలలో భారీ సెట్టింగ్‌లు ఉండటంతో సినిమా చూసిన అనుభూతి కలిగేది. ఇక్కడ ప్రదర్శించే నాటకాలలో ప్రముఖులు షణ్ముక ఆంజనేయరాజు, పీసపాటి నరసింహమూర్తి, సూరవరపు వెంకటేశ్వర్లు, కాగితం సుబ్బారావు, లక్ష్మణ్‌రావు, సీఎస్ఆర్ అంజనేయులు, ద్వారంపూడి సూర్యారావు వంటి దిగ్గజాలు ఇక్కడ నాటకాలలో తమ ప్రతిభను ప్రదర్శించేవారు.



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో ఆకర్షిస్తున్న సెట్టింగ్

దసరా ఉత్సవాలలో పాల్గొన్న సినీ ప్రముఖులు

ఎస్వీ రంగారావు, అక్కినేని నాగేశ్వరరావు, సీఎస్ఆర్ ఆంజనేయులు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జమున, ప్రభాకర్‌రెడ్డి, రేలంగి, అంజలీదేవి, ఆదినారాయణ రావు, సత్యనారాయణ, జి.వరలక్ష్మి, సావిత్రి, జెమినీ గణేష్, కృష్ణ, శారద, చలం, గీతాంజలి, రాజబాబు వంటి తెలుగు తారలే కాకుండా సునీల్ దత్ వంటి హిందీ నటులు కూడా ఇక్కడ నాటకాలను తిలకించారు. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టిగా పద్మనాభం, బాలనాగమ్మలో మాయల ఫకీర్‌గా రాజనాల నటించగా 1966, 68 సంవత్సరాలలో రాజసులోచన ఇక్కడ నాట్యం చేశారు.

భారీ సెట్టింగ్‌లకు పెట్టింది పేరు

దేవీచౌక్ నాలుగు కూడళ్లు భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతాయి. ఇక్కడి సెట్టింగ్‌లు చూడడానికి జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి కూడా ప్రజలు వచ్చేవారు.

నేడు కలశ స్థాపన

బుధవారం రాత్రి 9.09 గంటలకు అమ్మవారిని వేదమంత్రాలతో స్టేజీపైన ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంతో శరన్నరాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం 8.40 గంటలకు కలశ స్థాపనతో లాంఛనంగా ప్రారంభిస్తారు. తొలి రోజు అమ్మవారు శ్రీస్వర్ణ కవచ కనక దుర్గాదేవి అవతారంలో కనిపిస్తారు. గురువారం రాత్రి 10 గంటలకు హైదరాబాద్ నవక్రాంతి వారి శ్రీకనకదుర్గ మహాత్యం నాటకాన్ని ప్రదర్శిస్తారు.

వేలాదిగా భక్తులు వస్తారు



ఈ తొమ్మిది రోజులూ అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన అమ్మవారి ఉత్సవాలు ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాం. ప్రతి రోజు ఉదయం నుంచి కుంకుమ పూజలు, అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తాం. ప్రసిద్ధి చెందిన కళాకారులు ఇక్కడ నాటకాలను ఇక్కడ ప్రదర్శించనున్నారు.

– బత్తులు రాజరాజేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

దొరికిందెంత.. దోచిందెంత?

- పేకాట స్థావరంపై మెరుపు దాడి
- పట్టుబడింది రూ.6.45 లక్షలు.. కేసులో చూపింది రూ.55,500
- పంపకాల్లో తేడా రావటంతో బహిర్గతం
- ఆగ్రహించిన ఎస్పీ.. విచారణకు ఆదేశం
- డీఎస్పీ పర్యవేక్షణలో మూడు రోజులుగా రహస్య విచారణ

పెరవలి: కంచే చేను మేసిందన్న చందంగా చట్టాన్ని పరిరక్షించవలసిన పోలీసులే అవినీతికి పాల్పడి, చట్టాన్ని తుంగలో తొక్కిన తీరు చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. పేకాట స్థావరంపై దాడి చేయగా రూ.లక్షల్లో దొరికినా కేసులో కేవలం రూ.వేలల్లో చూపించటంతో జూదరులు విస్తుపోవటంతో పాటు విషయం బహిర్గతం కావడంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు. దాచేసిన సొమ్ము పంపకాల్లో తేడా రావటంతో పోలీసుల చేసిన ఈ నిర్వాకం ఎస్పీ దృష్టికి వెళ్లింది. ఆగ్రహించిన ఎస్పీ నరసింహ కిషోర్ రహస్య విచారణ చేపట్టాలని కొవ్వూరు డీఎస్పీని ఆదేశించారు. దీంతో మూడు రోజులుగా అన్నవరప్పాడు, పెరవలి, కొవ్వూరులో రహస్య విచారణ చేశారు.

పెరవలి మండలం అన్నవరప్పాడు సెంటర్‌కు సుమారు 150 మీటర్ల దూరంలో పిట్టల వేమవరం- మల్లేశ్వరం సరిహద్దులో కాలువ గట్టు పక్కన పశువుల పాకలో పేకాట ఆడుతుండగా గత నెల 8వ తేదీరాత్రి పోలీసులు మెరుపు దాడి చేసి ఏడుగురు జూదరులను పట్టుకున్నారు. సొమ్ము లక్షల్లో దొరకటంతో పోలీసుల్లో ఆశ కలిగి జూదరులను బెదిరించి కేవలం వేలల్లో కేసులో చూపించారు. అంతేకాకుండా ఈ విషయం బయటకు తెలియకుండా ముందస్తుగానే పోలీసులు రహస్యంగా జూదరులతో కేవలం వేలల్లో సొమ్ము ఉందని చెప్పించి, వీడియో తీయించుకున్నారని తెలిసింది.

జూదరులతో పోలీసుల కుమ్మక్కు

పేకాట స్థావరంపై మెరుపు దాడి చేసి ఏడుగురు జూదరులను పట్టుకున్న పోలీసులు వారి వద్ద నుంచి రూ.6.45 లక్షల సొమ్ము స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఇందులో జూదరులకు తిరిగి రూ.1.50 లక్షలు ఇవ్వగా, కేసులో చూపించిన రూ.55,500 పోను మిగిలిన రూ.4 లక్షల సొమ్ము పోలీసులు నొక్కేశారు. పేకాట ఆడుతున్న వారిని పట్టించిన ఒక జూదరి పోలీసులు, జూదరులు కలిసి ఆడిన నాటకాన్ని ఎస్పీకి తెలియజేయడంతో ఈ విషయం ఆలస్యంగానైనా వెలుగులోకి వచ్చిందని చెప్పుకుంటున్నారు.

విషయం బయటకు రాకుండా..

ఈ కేసులో ట్విస్ట్ ఏమిటంటే పేకాట స్థావరంపై 8వ తేదీ రాత్రి దాడి చేయగా ఆ రాత్రే కేసు నమోదు చేసి మరుసటి రోజే కోర్టులో జూదరులను హాజరు పర్చారు. లోక్ అదాలత్‌లో కేసు ప్రవేశపెట్టి జూదరులకు కేవలం రూ.100 జరిమానా విధించేలా పోలీసులు కేసును నీరుగార్చారు. పోలీసులు సొమ్మును దోచేయకపోతే మొత్తం సొమ్మును కేసులో చూపించేవారు. అయినా దొరికింది కేవలం రూ.55 వేలే అయితే కేసును నేరుగా కోర్టులో ప్రవేశపెట్టకుండా లోక్‌అదాలత్‌లో ప్రవేశపెట్టి కేసు లేకుండా ఎందుకు చేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నొక్కేసిన సొమ్ము విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు జూదరులను పోలీసులు రక్షించారని పలువురు అంటున్నారు.

నిజం ఇలా బయట పడింది

రహస్య విచారణలో భాగంగా మూడు రోజుల క్రితం అన్నవరప్పాడులో జూదరులతో విడివిడిగా పోలీసులు మంతనాలు జరిపినా కేవలం మా దగ్గర రూ.55 వేలే దొరిందని చెప్పటంతో విచారణకు వచ్చిన టీమ్ సభ్యులు పోలీస్‌బాస్‌కు తెల్పటంతో జూదరులతో కాకుండా మిగిలిన వారిని విచారణ చేస్తేనే కదా అసలు విషయం తెలుస్తుందని ఆయన ఆగ్రహించినట్లు సమాచారం. మరుసటి రోజు రహస్యంగా జూదరులను కొవ్వూరు తీసుకువెళ్లి అక్కడ డీఎస్పీ దేవకుమార్ సమక్షంలో విచారణ చేయగా జరిగిన బాగోతం అంతా జూదరులు వివరంగా చెప్పినట్టు తెలిసింది. ఈ వ్యవహారం నుంచి బయట పడేందుకు జూదరులు రాజకీయ పలుకుబడిని ఉపయోగించేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు సిఫారసు



ఖైదీలనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రత్యేక మహిళా కారాగారం ఒక సబర్మతీ ఆశ్రమాన్ని తలపిస్తోందని ఇక్కడ ఉన్న వారు చాలా ఆరోగ్యంగా ఆనందంగా ఉన్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. జైలు సూపరింటెండెంట్, సిబ్బంది.. ఖైదీలను బాగా చూసుకుంటూ వారిలో పరివర్తన తీసుకువచ్చే దిశగా పనిచేస్తున్నారని అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. జిల్లా జడ్జి గంధం సునీత ముఖ్య అతిథిగా పాల్గొని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.ప్రకాష్‌బాబు, విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయకుమారి, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి, సూర్యప్రభ, ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్స్ డాక్టర్ వర్ధిని, డాక్టర్ భవాని పాల్గొన్నారు. జిల్లా జడ్జి గంధం సునీత ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు సుప్రీంకోర్టుకు సిఫారసు చేస్తామని చెప్పారు. ఖైదీల సమస్యలు తెలుసుకొని వారికి న్యాయం చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటపాటలలో గెలుపొందిన ఖైదీలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పిల్లలకు బొమ్మలు, దుస్తులు, పుస్తకాలు, రంగుల పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంతకుమారి, జైలర్ కుమారి పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలకే దిక్కు లేదు

- గాంధీ జయంతి రోజున యథేచ్ఛగా పాఠశాలలు
- నేటి నుంచి దసరా సెలవులు.. అయినా తెరుచుకోనున్న స్కూల్స్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అక్టోబర్ 2, గాంధీ జయంతి. ఈ రోజంటే పిల్లలందరికీ ఆనందం. ఎందుకంటే అన్ని విద్యాసంస్థలకు ప్రభుత్వ సెలవు దినం. అయితే ఎన్నడూ లేనివిధంగా గాంధీ జయంతి రోజైన బుధవారం జిల్లావ్యాప్తంగా అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా తెరచారు. కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహించారు. దసరా సెలవులు ఈ నెల 3 నుంచి 14వ తేదీ వరకు ప్రకటించారు. అయితే మూడో తేదీన స్కూల్స్ ఉన్నాయంటూ తల్లిదండ్రుల ఫోన్‌లకు ఆయా విద్యాసంస్థల నుంచి మెసేజ్‌లు వచ్చాయి.

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం ముగింపు మాత్రమే నిర్వహించాలి

గాంధీ జయంతి రోజున పాఠశాలలన్నీ స్వచ్ఛత హీ సేవా ముగింపు కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉదయం పిల్లలను స్కూల్స్‌కు రప్పించాలని, అయితే వారికి హాజరు వేయవద్దని, ఒక గంటలో కార్యక్రమం పూర్తి చేసి పంపేయాలని ఆదేశించారు. అయితే దీన్ని ఆసరాగా తీసుకున్న ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులందరికీ గాంధీ జయంతి రోజు స్కూలుకు సెలవు లేదని, ఎప్పటి మాదిరిలానే ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కూలు ఉంటుందని సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు పంపాయి. ఇదేంటి గాంధీ జయంతి రోజున స్కూల్ ఏమిటి అని ఆశ్చర్యపోయిన తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో తమ పిల్లలను స్కూలుకు పంపారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు 'సాక్షి' తో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక గంట సేపు స్కూల్స్ తెరిచి స్వచ్ఛత హీ సేవా ముగింపు కార్యక్రమం నిర్వహించి తిరిగి విద్యార్థులను వెంటనే పంపివేయాలని తెలిపామన్నారు. గాంధీ జయంతి రోజున స్కూల్స్ తెరచి తరగతులు నిర్వహించిన విద్యాసంస్థలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులు



మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మహాత్ముల జయంతిని పురస్కరించుకుని వారి ఆశయాలను మనం కూడా ఆచరణలో చూపడమే వారికీ అందించే నిజమైన నివాళి అని కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం, స్వచ్ఛభారత్ సాధన కోసం గాంధీజీ కలలు కన్నారన్నారు. ఆడపిల్లలు అర్ధ రాత్రి స్వేచ్ఛగా తిరిగే పరిస్థితులు ఉన్నప్పుడే నిజమైన స్వాతంత్యం వచ్చినట్టు అని ఆయన పలు సందర్భాల్లో పేర్కొన్నారన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన ఇంకా గాంధీ కలలు సాకారం కాలేదన్నారు. ఎవరికివారు పరిశుభ్రంగా ఉండడం అలవాటుగా మార్చుకోవాలని, జీవితంలో శుభ్రత ఒక భాగం కావాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు మాట్లాడుతూ గాంధీ జీవితం కోసం తెలుసుకొని భావితరాలకు అందించే బాధ్యతను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వారి జీవిత చరిత్ర ఎంతో ఆదర్శప్రాయంతో కూడుకున్నదని వాటి నుంచి స్ఫూర్తి పొందాలని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఇతర జిల్లా అధికారులు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుష్కర కాలువలో విద్యార్థి గల్లంతు!



పుష్కర కాలువలో గాలిస్తున్న స్థానికులు



సతీష్ (ఫైల్)

పిఠాపురం: బహిర్భూమికి వెళ్లిన విద్యార్థి ప్రమాదవశాత్తూ పుష్కర కాలువలో పడి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లప్రోలు మండలం కొడవలికి చెందిన ఉప్పనబోయిన సతీష్ బుధవారం ఆ గ్రామ సమీపంలోని పుష్కర కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. రోజూ మాదిరిగానే వెళ్లిన బాలుడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. కాలువలో పడిపోయి ఉండాడని భావించి గొల్లప్రోలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై నౌడు రామకృష్ణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. అయితే బుధవారం సాయంత్రం వరకూ కాలువలో ఎంత గాలించినా సతీష్ ఆచూకీ దొరకలేదు. దీంతో గురువారం ఉదయం నుంచి మళ్లీ గాలిస్తామని ఎస్సై తెలిపారు. సతీష్ తాటిపర్తి హైస్కూలులో 10వ తరగతి చదువుతున్నారు. బాలుడు గల్లంతవ్వడంతో తండ్రి వీర వెంకట సత్యనారాయణ, తల్లి శిరీష, అక్క శ్రీదేవి గుండెలవిసేలా రోదిస్తున్నారు.

7,200 లీటర్ల డీజిల్ స్వాధీనం



కోరంగి పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

తాళ్లరేవు: యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 7200 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని, మూడు వాహనాలను అధికారులు సీజ్ చేశారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎస్ఓ లక్ష్మీ ప్రసన్న, వీఆర్వోలతో కలిసి కోరంగి పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 7200 లీటర్ల డీజిల్‌ను తరలిస్తున్న మూడు వాహనాలను గుర్తించారు. యానాంలోని పెట్రోల్ బంకుల నుంచి డీజిల్‌ను కొనుగోలు చేసి కాకినాడకు తరలించి, ఇక్కడి బోట్లు, ఆక్వా చెరువులకు విక్రయిస్తున్నారు. యానాంలో లీటర్ డీజిల్‌ను 84.79కు కొనుగోలు చేసి మన రాష్ట్రంలో రూ.97కి అమ్ముతున్నారు. ఆ వాహనాలతో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

లారీ డ్రైవర్ మృతి

తొండంగి: ముందు వెళుతున్న లారీ సడన్‌గా ఆగడంతో దాన్ని వెనుక నుంచి ఢీకొన్న మరో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐరన్ లోడుతో విశాఖపట్నం నుంచి విజయవాడ వైపునకు లారీ వెళుతోంది. తొండంగి మండలం బెండపూడి శివారు జాతీయ రహదారిపై అన్నవరం నమూనా టెంపుల్ సమీపంలోకి వచ్చేటప్పటికీ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో వెనకాలే విశాఖపట్నం నుంచి పాలకొల్లు వెళుతున్న కంటెనర్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆ లారీ కేబిన్‌లోని డ్రైవర్ బలుసు వెంకటరమణ (30) తీవ్రంగా గాయపడ్డాడు. కేబిన్‌లో చిక్కుకున్న అతడిని పోలీసులు, హైవే సిబ్బంది బయటకు తీసి తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ అక్కడ చికిత్స పొందుతూ రమణ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పి.వెంకటాపురంలో నిర్మించిన పీఎం కేంద్రీయ విద్యాలయ నూతన భవనం



పాఠశాల ప్రాంగణంలో సమావేశాల కోసం ఏర్పాటు చేసిన వేదిక

చదువులమ్మకు సొంతగూడు

- కేంద్రీయ విద్యాలయకు నూతన భవనం
- పి.వెంకటాపురంలో సర్వహంగులతో సిద్ధం
- ఇరుకు గదులకు స్వస్తి
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మాణం



నూతన భవన ప్రాంగణంలో విద్యార్థుల సందడి

కాకినాడ రూరల్: ఇరుగు గదులు.. చాలీచాలని భవనాలు.. అంతంత మాత్రంగా ఉండే సదుపాయాలతో నెట్టుకొచ్చిన కాకినాడ కేంద్రీయ విద్యాలయకు మంచి రోజులు వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా వలసపాకల గ్రామంలోని కాకినాడ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయకు నూతన భవనం సమకూరింది. కాకినాడ రూరల్ మండలం పి.వెంకటాపురం గ్రామంలో సుమారు ఐదు ఎకరాల విశాలమైన స్థలంలో కేంద్ర ప్రభుత్వం నిధులు రూ.28.43 కోట్లతో పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ పేరిట నూతన భవనాలు నిర్మాణం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2022 నవంబర్‌లో ప్రారంభించారు. ప్రధాని మోదీ దృష్టికి కేంద్రీయ విద్యాలయ దుస్థితిని తీసుకువెళ్లి నిధులు రాబట్టడంలో అప్పటి ఎంపీ వంగా గీత సఫలీకృతమయ్యారు. పట్టుదలతో ఆమె చేసిన కృషికి ఫలితంగా భావి పౌరులను తీర్చిదిద్దే సరస్వతి నిలయం నేడు అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ ఒకటి నుంచి పది వరకూ తరగతులు నిర్వహించేందుకు వీలుగా భవనాలు నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుతో కూడిన భవనాలలో మొత్తం 47 గదులు ఉన్నాయి. వీటిలో 24 గదులను తరగతులుగా వినియోగించనున్నారు. అలాగే సభలు, కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదిక, పాఠశాల ఆవరణలోని రూ.4.05 కోట్ల బాస్కెట్ బాల్, వాలీబాల్ మైదానాల నిర్మాణం చేపడుతున్నారు.

జూలై నుంచి నూతన భవనంలో తరగతులు

వలసపాకలలో ఇరుకైన గదుల్లో పడుతున్న ఇబ్బందులకు స్వస్తి పలికి ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూలై నుంచి పి.వెంకటాపురంలోని కొత్త భవనంలోకి పాఠశాలను తరలించారు. దీంతో నూతన భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ప్లే గ్రౌండ్ పనులు పూర్తయితే పీఎం కేంద్రీయ విద్యాలయ నూతన భవనం పూర్తిగా అందుబాటులోకి వస్తుంది. నేషనల్ ప్రాజెక్ట్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌పీసీసీ) ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. అక్టోబర్ నెలాఖరుకు పనులు పూర్తవుతాయని ఏఈ ఈశ్వరరావు తెలిపారు.

కొత్త భవనంతో విద్యార్థులకు ఊపిరి

గతంలో వలసపాకలలో విద్యార్థులు ఊపిరి ఆగినంత పని అయ్యింది. ఇరుగు గదుల్లో గాలి ఆడక సుమారు 30 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అప్పట్లో పరిశ్రమల నుంచి వచ్చిన విష వాయువుల ప్రభావం ఉంటుందని ప్రచారం జరిగింది. ఇరుగు గదుల్లో విష వాయువు కారణంగానే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అప్పట్లో నిర్ధారణ చేశారు. ఇప్పుడు వలసపాకల నుంచి పాఠశాలను తరలించడంతో విద్యార్థులకు ఊపిరి వచ్చినట్టు అయ్యింది. విశాలమైన గదుల్లో చదువులు సాగనున్నాయి. ప్రస్తుతం 405 మంది విద్యార్థులు కేంద్రీయ విద్యాలయలో చదువుతున్నారు.

ప్రశాంత వాతావరణం



కొత్త భవనంలో తరగతి గదులు బాగున్నాయి. ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు అవకాశం కలిగింది. అయితే కాకినాడకు దూరంగా ఉండడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది.

– రిషిత జాస్తికా, 9వ తరగతి

తరగతుల నిర్వహణ

వలసపాకల కాకినాడ పబ్లిక్ స్కూల్ ఆవరణలోని కేంద్రీయ విద్యాలయను పి.వెంకటాపురానికి తరలించారు. నూతన భవనం పూర్తిగా మాకు అప్పగించలేదు. తరగతి గదులు గల భవనాలు పూర్తవడంతో తరగతులు ఇక్కడే నిర్వహిస్తున్నాం. పీఎం మోదీ చేతులు మీదుగా త్వరలో పీఎం కేంద్రీయ విద్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం ఉంటుంది.

– బొంతు శేఖర్, ప్రిన్సిపాల్, కేంద్రీయ విద్యాలయ.

వెయ్యి కోట్ల కుంకుమార్చనలే లక్ష్యం

- రానున్న పదేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు
- శ్రీపీఠంలో నేటి నుంచి దసరా ఉత్సవాలు
- విలేకరులతో పరిపూర్ణానందస్వామి



కాకినాడ రూరల్: శ్రీపీఠంలో ఈ దసరా నుంచి రానున్న పదేళ్లలో వెయ్యికోట్ల కుంకుమార్చనలు నిర్వహించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పరిపూర్ణానంద స్వామి వెల్లడించారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని శ్రీపీఠంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాశక్తి యాగం పేరిట గురువారం నుంచి దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గత ఏడాది కార్తిక మాసంలో 30 రోజుల పాటు వంద కోట్ల మంది మహిళలతో కుంకుమార్చన నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమవ్వడంతో దసరా ఉత్సవాల్లో కుంకుమార్చనలకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ పూజల కోసం ఇప్పటికే 54 వేల రిజిస్ట్రేషన్లు అయ్యాయని, రోజూ కనీసం 35 వేల నుంచి 40 వేల మంది మహిళలు హాజరవుతారని భావించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం పది గంటలకు కుంకుమార్చన ప్రారంభమవుతుందని, భక్తులు 9 గంటలకు హాజరవ్వాలన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా 9వ తేదీన మూలా నక్షత్రం సందర్భంగా 24 వేల మంది విద్యార్థులతో సరస్వతీ పూజ జరిపిస్తామన్నారు. 10న దుర్గాష్టమి రోజున 64 వేల మంది భక్తులు ఒకే రకమైన వస్త్రధారణతో కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. నవమి రోజు దాత సమకూర్చనున్న 15 వేల తులసి మొక్కలతో పూజలు చేసి 9 రోజులు పూజలో పాల్గొన్న వారికి అందజేస్తామన్నారు.

విక్రయానికి తల్లి ఒప్పుకోలేదనే శిశువు హత్య

- ఆడపిల్లను చంపిన తండ్రి అరెస్టు
- రిమాండ్‌కు తరలింపు



కేసు వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు

కాకినాడ క్రైం: ఆడపిల్ల పుట్టిందనే కోపంతో రగిలిపోతున్న అతడు ఆ శిశువుకు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. దానికి తల్లి ఒప్పుకోకపోవడంతో 34 రోజుల బిడ్డను దారుణంగా చంపేశాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ వన్ టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. జగన్నాథపురం పప్పుల మిల్లు సమీపంలో నివసిస్తున్న కేతా శివమణి తనకు ఆడపిల్ల పుట్టిందని కోపంతో ఉండేవాడు. చివరకు ఆ పాపను అమ్మేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని మంగళవారం శిశువు తల్లి అయిన తాను సహజీవనం చేస్తున్న చెక్కా భవానీతో చెప్పాడు. ఆమె దానికి ఒప్పుకోకపోవడంతో ఆగ్రహంతో ఊగిపోయాడు. పాపను చంపాలని నిర్ణయించుకుని తొలుత గొంతునులిమాడు. కొనప్రాణాలతో కొట్టుమిట్టాడున్న శిశువును గోడకేసి కొట్టి పరారయ్యాడు. వెంటనే తల్లి స్థానికుల సాయంతో పాపను ఆసుపత్రికి తరలించగా శిశువు మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కాగా.. పరారీలో ఉన్న శివమణిని ప్రత్యేక బృందాలు డాగ్ స్క్వాడ్ సాయంతో గాలించి పట్టుకున్నాయి. అతడిని బుధవారం ఉదయం అరెస్టు చేసి కాకినాడ మూడో ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు రిమాండ్ కోసం తరలించామన్నారు. గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్న సీఐ నాగదుర్గారావు, ఆయన బృందాన్ని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

రూ.5.86 లక్షల విలువైన ఆయిల్ సీజ్



పాశర్లపూడిలంకలో విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన ఆయిల్ పీపాలు

మామిడికుదురు: అక్రమంగా నిల్వ ఉంచిన సాల్వెంట్ ఆయిల్‌ను విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. ఈ సందర్భంగా పాశర్లపూడిలంకకు చెందిన రాచకొండ వెంకటేశ్వరరావు అలియాస్ ఆయిల్ శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 47 పీపాల్లో నిల్వ చేసిన రూ.5.86 లక్షల విలువైన 9,400 లీటర్ల సాల్వెంట్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎంఎస్ఓ దేవళ్ల శ్రీనివాస్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. తీగ లాగితే డొంక కదిలిన తరహాలో ఈ వ్యవహారం వెలుగు చూసింది. రావులపాలెంలో ఒక కేసు విచారణ సందర్భంగా ఆయిల్ శ్రీను వ్యవహారం వెలుగు చూసింది. సఖినేటిపల్లి మండలం పల్లిపాలెం వద్ద నిందితుడికి ఉన్న బయో డీజిల్ బంకుకు చెందిన బిల్లు రావులపాలెం కేసులో బయటపడింది. దాని ఆధారంగా మంగళవారం విజిలెన్స్, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. గురువారం ఉదయం వరకు ఏకదాటిగా చేసిన విచారణలో అక్రమంగా నిల్వ ఉంచిన ఆయిల్ వ్యవహారం వెలుగుచూసింది. 55 ఖాళీ పీపాలను కూడా స్వాధీనం చేసుకుని, పాశర్లపూడి పెట్రోల్ బంకు యజమానికి అప్పగించారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని నగరం ఎస్సై ఎ.చైతన్య కుమార్ తెలిపారు.

అధికారుల పర్యవేక్షణ లేకే నగదు గల్లంతు

సీతానగరం: అధికారుల పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారింది. వెదుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రైతులకు సంబంధించిన రుణ చెల్లింపులు, షేర్ క్యాపిటల్ రూ.56 లక్షలు గల్లంతైన విషయం తెలిసిందే. వెదుళ్లపల్లి పీఏసీఎస్‌పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు నెలల క్రితం నగదు గల్లంతైందని వెలుగులోకి వచ్చినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఆ సొమ్మును రికవరీ చేయలేకపోయారు. దీనికి ముందు సంఘంలో సేల్స్‌మన్‌ను ఏర్పాటు చేసి ఎరువుల అమ్మకాలు జరిపారు. వాటిలో సుమారు రూ.7 లక్షలు గోల్‌మాల్ జరిగినట్టు గుర్తించిన అధికారులు సంఘంలో ఆ నగదు జమ చేయాలని నామమాత్రంగా చెప్పి వదిలేశారు. ఎరువుల నగదు గల్లంతైందని గుర్తించిన నెల రోజులకు పీఏసీఎస్ రికార్డుల తనిఖీలో రూ.56 లక్షలు మాయమైనట్టు వెలుగులోకి వచ్చింది. ఈ సొమ్ములు కట్టాలని సంఘం సీఈవో సురేంద్రకు ఆదేశించి రెండు నెలలైనా అతడు పట్టించుకోలేదు. అలాగే కోరుకొండ మండలం శ్రీరంగపట్నం పీఏసీఎస్‌లో ఏడాది క్రితం రూ 2.కోట్ల కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో గుమస్తా ఉద్యోగం ఇచ్చారు. గత నెల కోరుకొండ మండలం బుచ్చింపేటలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఆ శిబిరంలో సంఘం సీఈవో సురేంద్ర ఉన్నట్లు సమాచారం. ఎరువుల నగదు గల్లంతైన సమయంలోనే అధికారులు కఠినంగా వ్యవహరించి ఉంటే ఇప్పుడు ఇన్ని లక్షల పోయేవి కాదని రైతులు చెబుతున్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- 8వ తేదీ నుంచి జిల్లాకు 37 ప్రత్యేక బస్సులు
- దసరా అనంతరం 75 స్పెషల్ సర్వీసులు



దసరా ప్రయాణికుల కోసం సిద్ధంగా ఉన్న ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రాజమహేంద్రవరం సిటీ: దసరా సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు హైదరాబాద్ నుంచి తరలివచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను సిద్ధం చేశారు. ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ హైదరాబాద్ నుంచి జిల్లాలోని గోకవరం, కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం డిపోలకు వచ్చే ప్రయాణికుల కోసం 37 సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేశారు. వీటితో పాటు విశాఖపట్నం విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్టు అధికారులు ప్రకటించారు.

దసరా తరువాత 75 ప్రత్యేక బస్సులు

దసరా పండగ అనంతరం జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఇతర ప్రాంతాలకు తరలివెళ్లే ప్రయాణీకుల సౌకర్యార్థం 75 ప్రత్యేక బస్సులను సిద్ధం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరిన్ని ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.

సాధారణ చార్జీలతో ప్రత్యేక సర్వీసులు

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు కాక ముందు వరకు ఏపీఎస్ ఆర్టీసీ పండగలు, ఇతర ప్రత్యేక సర్వీసుల్లో ప్రయాణించేవారికి అధిక చార్జీలు వసూలు చేసేది. ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు కూడా పరిస్థితులను బట్టి రెండింతలు, ఇంకా ఎక్కువ మొత్తంలో వసూలు చేసి నిలువు దోపిడీ చేసేవారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజల ఇబ్బందులు గుర్తిస్తూ సాధారణ చార్జీతోనే స్పెషల్ సర్వీసుల్లో ప్రయాణించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలిగింది. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన ఈ విధానాన్ని ఆర్టీసీ అధికారులు నేటికీ అమలు చేస్తున్నారు.

గత ఏడాది (2023–24) దసరా ప్రత్యేక బస్సులు

- దసరా సందర్భంగా గతేడాది దసరా ముందుగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఖమ్మం ప్రాంతాల నుంచి 82 ప్రత్యేక బస్సులను నడిపారు. దీని ద్వారా 44,943 కిలోమీటర్లు బస్సులు నడపగా 5,097 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. వీరిద్వారా రూ.17,74,661 ఆదాయాన్ని సాధించారు.
- దసరా తరువాత జిల్లాలోని నాలుగు డిపోల నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఖమ్మం, శ్రీశైలం, యానాం ప్రాంతాలకు 105 ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా రూ.26,68,317 ఆదాయాన్ని సాధించారు. దీని ద్వారా 53,107 కిలోమీటర్లు ద్వారా 8790 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.

ప్రజలు స్పెషల్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి



దసరా పండగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం విశేష ఏర్పాట్లు చేశాం. హైదరాబాద్ నుంచి జిల్లా తరలివచ్చే ప్రయాణికుల కోసం జిల్లాలోని నాలుగు డిపోలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. దసరా అనంతరం తిరుగు ప్రయాణానికి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రత్యేక బస్సులను నడుపుతాం.

– షర్మిల అశోక, ఆర్టీసీ డీపీటీఓ, రాజమహేంద్రవరం

చోరీ కేసులో ఇద్దరు యువకుల అరెస్టు



నిందితులు, వారి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులతో సీఐ విద్యాసాగర్

కొత్తపేట: చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ బుధవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. కొత్తపేట బ్యాంకు కాలనీలో నివాసముంటున్న రామోజు అనురాధ, తన కుటుంబ సభ్యులతో ఈ ఏడాది మే 5వ తేదీ సాయంత్రం రాజమహేంద్రవరంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి 9వ తేదీ ఉదయం ఇంటికి రాగా తలుపు బద్దలు కొట్టి తెరిచి ఉంది. ఇంట్లోకి వెళ్లి బీరువాలో పరిశీలించగా దానిలో భద్రపరిచిన బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేశారు. ఎస్పీ బి.కృష్ణారావు పర్యవేక్షణలో డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై జి.సురేంద్ర దర్యాప్తు జరిపారు. ఈ సందర్భంగా కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన బండారు మణికంఠ, చింతపల్లి వెంకటరాజు అనే యువకులను అరెస్టు చేశారు. వారి నుంచి 212 గ్రాముల బంగారం వస్తువులు, 2 కేజీల వెండి వస్తువులు, వాచీ స్వాధీనం చేసుకున్నారు. కాగా.. ఈ కేసును చేధించిన డీఎస్పీ వై.గోవిందరావు, సీఐ విద్యాసాగర్, సీసీఎస్ సీఐ డి.ప్రశాంత్, ఎస్సై జి.సురేంద్ర, సీసీఎస్ ఏఎస్సై ఏ.బాలకృష్ణ, హెచ్‌సీలు డీఎస్ స్వామి, ఎం.వీర్రాజు, పీసీలను ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

ఉద్యోగాలు, ఇళ్ల పేరుతో మోసం

రూ.కోటితో వ్యక్తి పరారీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉద్యోగాలు, ఇళ్లు, ఇంటి స్థలాలు ఇప్పిస్తానని, వ్యాపారాలు చేయిస్తానంటూ మాయమాటలు చెప్పి రూ.కోటితో వ్యక్తి పరారయ్యాడు. ఈ ఘటనలో బుధవారం మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వజ్రే అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేటకు చెందిన ఎ.శాంత సరోజినీ అదే ప్రాంతంలోని సచివాలయంలో ఏఎన్ఎమ్‌గా పనిచేస్తోంది. లింగంపేటకు చెందిన కమిడి వరలక్ష్మి కూడా అక్కడే ఏఎన్ఎమ్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో సరోజని, వరలక్ష్మి మధ్య స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలో వరలక్ష్మి భర్త తారక రామ సతీష్.. సరోజనికి ఇల్లు కొనిపిస్తానని పలు దఫాలుగా రూ.13.25 లక్షలు, 10 కాసుల బంగారం తీసుకున్నాడు. దీనిపై మాట్లాడేందుకు సతీష్‌కు సరోజని ఫోన్ చేస్తుంటే అందుబాటులో లేడని సమాధానం వస్తోంది. అలాగే వరలక్ష్మి ఇంటికి తాళం వేసి ఉండడంతో అనుమానం కలిగింది. వెంటనే వారి కోసం ఆరా తీయగా వీటితో సతీష్ తన భార్యాపిల్లలతో పరారైనట్లు తెలిసింది. 39వ డివిజన్‌కు చెందిన పాడుగు శ్రీనివాస్ వద్ద రూ.21 లక్షలు, నేతి సత్యనారాయణమూర్తి వద్ద రూ.11 లక్షలు, బంటిపల్లి శ్రీనివాస్ నుంచి రూ.18 లక్షలు, బంటిపల్లి హరిబాబు నుంచి రూ.8 లక్షలు, లింగంపేటకు చెందిన షేక్ అబ్దుల్ ఇర్ఫాన్‌ఖాన్ నుంచి రూ.18 లక్షలు, ముంగండ ఉదయ సత్య కిరణ్ నుంచి రూ.3.20 లక్షలు, దుక్కర నాగమణి నుంచి రూ.30 వేలు చొప్పున సతీష్ వసూలు చేసినట్టు తేలింది. దాదాపు రూ.కోటి మేర పలువురి నుంచి వసూలు చేసి సతీష్ పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక తనిఖీలో ఉద్యోగులపై వేటు

శంఖవరం: ఉద్యోగులపై వేటు వేయడానికే ప్రాధాన్యమిస్తూ ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభ జరిగింది. ఎంపీపీ పర్వత రాజుబాబు అధ్యక్షతన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సభ నిర్వహించారు. ఈ సభకు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ జరిగిన ఉపాధి పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ ఏడాదిలో రూ.9.66 లక్షల పనులు జరగ్గా రూ.6.44 లక్షలు వేతనాలకు, రూ.3.22 లక్షలు మెటీరియల్ రూపంలో ఖర్చు చేశారు. మండల వ్యాప్తంగా 14 పంచాయతీల్లో జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.1.62 వేలు రికవరీ గుర్తించినట్లు తెలిపారు. టీడీపీ నేతలు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేయడమే లక్ష్యంగా ఫిర్యాదులు చేశారు. కత్తిపూడి, మండపం ఫీల్డ్ అసిస్టెంట్లపై ఒత్తిడి చేసి, వారితో రాజీనామాలు చేయించారు. వారి ఫిర్యాదుపై నెల్లిపూడి, ఎస్.జగ్గంపేట ఫీల్డ్ అసిస్టెంట్లను పీడీ సస్పెండ్ చేశారు. దీంతో సామాజిక తనిఖీ సభ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడానికి నిర్వహించినట్టు అయ్యింది. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, ఎస్ఆర్పీ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.